సాక్షి పల్నాడు

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



సెబ్ సూపరింటెండెంట్‌గా అరుణకుమారి

బాపట్లటౌన్: జిల్లా సెబ్ సూపరింటెండెంట్‌గా వి.అరుణకుమారి నియమితులయ్యారు. ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1500, మోడల్ ధర రూ.1200 వరకు పలికింది.

డాక్టర్ గురువారెడ్డికి పురస్కారం



గుంటూరు మెడికల్: జంధ్యాల పురస్కారానికి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురువారెడ్డిని ఎంపిక చేసినట్లు డాక్టర్స్ స్మైల్ క్లబ్ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వస్వామి ఆలయంలో అంద జేయనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయులకు పురస్కారాలు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో నూతనంగా ఆవిర్భవించిన సమైక్య ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ గౌరవ చైర్మన్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ అధ్యాపక, ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన విధి, విధానాలను ఎమ్మెల్సీ లక్ష్మణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జ్యూరీలో సభ్యులుగా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘాలైన అపుస్మా నుంచి కాటూరి వెంకటేశ్వరరావు, అప్సా నుంచి మేకల రవీంద్రబాబు, ఏసీ బీఈడీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీఆర్ఎస్ అమృత వర్షిణిలను సభ్యులుగా నియమించినట్లు వివరించారు. దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోపు 99499 29674 నెంబరుతో పాటు సంఘ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎం.సురేష్ (84668 40040), కో–ఆర్డినేటర్ పి.శ్రీనివాస రెడ్డి (94906 04729) ఫోన్ నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. సెప్టెంబర్ 3వ తేదీన బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే గురుపూజోత్సవంలో ఉత్తమ అధ్యాపక, ఉపాధ్యాయులను నగదు పురస్కారంతో పాటు శాలువా, జ్ఞాపికతో సత్కరిస్తామని వివరించారు.

ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీని విజయవంతం చేయాలి

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే భారత్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ (అగ్నిపథ్) ర్యాలీ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సంబంధిత శాఖల అధికారులు, కల్నల్ పునీత్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అగ్నిపథ్ పథకం ద్వారా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీతో అభ్యర్థులను ఎంపిక చేయనున్న నేపథ్యంలో తరలి వచ్చే వారి కోసం అన్ని వసతి ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పట్టణంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ర్యాలీ రిక్రూట్‌మెంట్‌కి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆర్మీ అధికారుల వసతికోసం ఎస్ఎస్ఎన్ కళాశాల బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికారులు వివరించారు. పలు జిల్లాల నుంచి వచ్చే అభ్యర్థుల కోసం బారికేడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, తాత్కాలిక మొబైల్ మరుగుదొడ్లు, వైద్య సహాయ కేంద్రం తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

ముగిసిన పెన్షన్ల పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ గుంటూరు జిల్లాలో శనివారంతో ముగిసింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు. వేలిముద్రలు, ఐరిష్ ఆధారంగా ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాలో శనివారం నాటికి 99.04 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లావ్యాప్తంగా ఈ నెలలో 2,49,667 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.68.59 కోట్లు కేటాయించింది. శనివారం సాయంత్రానికి 2,47,270 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3711 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 166 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1001 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 500 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 170 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 380 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1410 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

పౌరుషాల గడ్డలో ప్రగతి పతాక

- సీఎం వైఎస్ జగన్, పీఆర్కే ఆధ్వర్యంలో మున్ముందుకు..
- రూ.వేల కోట్లతో విద్యా, వైద్య, సేద్య సంక్షేమ ఫలాలు
- జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం
- జేజేలు పలుకుతున్న ప్రజలు

మాచర్ల: మాచర్ల నియోజకవర్గం.. ఒకనాడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యంత సమస్యాత్మక ప్రాంతం. ఫ్యాక్షనిజం జడలువిప్పి నక్సలిజం విలయతాండవం చేసిన ప్రదేశం. పగలూప్రతీకారాల రక్తపు మడుగుల్లో తడిచి ముద్దయిన పౌరుషాల గడ్డ. కరువు కరాళనృత్యంతో అభివృద్ధికి ఆమడ దూరంలో పేదరికపు వరదలో కొట్టుమిట్టాడిన కన్నీటి సీమ. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఈ ప్రాంతంపై ఎవరూ శ్రద్ధ చూపేవారు కాదు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టగానే నియోజకవర్గ రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. శాంతి కపోతం చిరునవ్వులు చిందించింది. అభివృద్ధికి అడుగుజాడలు పడ్డాయి. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) ఆధ్వర్యంలో ప్రగతి పరుగులు పెడుతోంది. ఫలితంగా సంక్షేమ సర్కారుకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు.

మాచర్లలో పరుగందుకున్న అభివృద్ధి అడుగుజాడలు

జాతీయ రహదారులకు మహర్దశ



సాగర్-దాచేపల్లి జాతీయ రహదారి

సీఎం వైఎస్ జగన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కృషితో నియోజకవర్గంలోని జాతీయ రహదారులకు మహర్దశపట్టింది. సాగర్–దావుపల్లి, సాగర్–దాచేపల్లి, మాచర్ల–నకిరికల్లు మూడు జాతీయ రహదారులకు ప్రభుత్వం రూ.800 కోట్లు కేటాయించింది. వీటి పనులు శరవేగంగా జరిగేలా పిన్నెల్లి చర్యలు చేపడుతున్నారు.

నాడు-నేడుతో రూ.వంద కోట్ల అభివృద్ధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని సంక్షేమ సర్కారు చేపట్టిన నాడు–నేడు పథకం ద్వారా మాచర్ల నియోజకవర్గంలో రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో 50 పడకల ప్రభుత్వాస్పత్రిని రూ. 3 కోట్లతో ఆధునికీకరించారు. విజయపురిసౌత్, వివిధ ప్రాంతాలలో ఆస్పత్రుల అభివృద్ధికి కోట్ల రూపాయలు కేటాయించారు.



ఆధునికీకరించిన మాచర్ల ప్రభుత్వాస్పత్రి

ప్రజల శ్రేయస్సే ధ్యేయం



నేను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచా. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నా. వైఎస్సార్ ఆశీస్సులతో, సీఎం జగన్ దీవెనలతో వేలకోట్లను తెచ్చి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నా. ప్రజల శ్రేయస్సే నా ధ్యేయం. రాబోయే రోజుల్లోనూ ప్రజలకు అండగా ఉండేది వైఎస్సార్ సీపీనే. సంక్షేమం, అభివృద్ధే మా నినాదం.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), ప్రభుత్వ విప్

నిజమైన అభివృద్ధిని చూస్తున్నాం



నేను గతంలో ఈ ప్రాంత వెనుకబాటుతనాన్ని చూశాను. తాగేందుకు గుక్కెడు నీళ్ల లేక ఇబ్బంది పడ్డాం. సాగునీరు లేక అవస్థలు పడ్డాం. అలాంటిది 2004లో వైఎస్సార్ హయాంలో ఈ ప్రాంత అభివృద్ధికి బీజం పడింది. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రగతి పరుగులు పెడుతోంది. నిజమైన అభివృద్ధిని ఇప్పుడు చూస్తున్నా.

– ఎ.లక్ష్మారెడ్డి, రైతు, శిరిగిరిపాడు,

వరికపూడిసెల ప్రదాత సీఎం జగన్



వైఎస్ రాజశేఖరరెడ్డి అభివృద్ధి కోసం ఒక అడుగు ముందుకేస్తే ఇప్పుడు వైఎస్ జగన్ పదడుగులు వేస్తున్నారు. మాచర్ల నియోజకవర్గంలోనే అత్యంత వెనుకపడిన వెల్దుర్తి మండలంలో వరికపూడిసెల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు సాధించారు. త్వరలో శంకుస్థాపన చేయనున్నారు.

సాగు, తాగునీటి వనరులకు స్వర్ణయుగం



వైఎస్సార్ 2004లో అధికారంలోకి రాగానే మాచర్ల నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఫ్యాక్షనిజం, నక్సలిజం పీచమణిచారు. సాగు, తాగునీటి వనరుల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. కొప్పునూరు, అనుపు లిఫ్ట్ ఇరిగేషన్‌కు చింతలతండాలో రూ.100 కోట్లు కేటాయించి 10వేల ఎకరాలకు సాగు, తాగునీరిచ్చేలా చర్య లు తీసుకున్నారు. ప్రతి మండలంలో పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చారు. సత్రశాల టైల్‌పాండ్ డ్యాంను రూ.1,000 కోట్లతో నిర్మించారు. జెన్‌కో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో రైతుల ప్రయోజనం కోసం వేల కోట్లు కేటాయించి రైతులకు ఎంతో మేలు చేశారు. మాచర్ల పట్టణ అభివృద్ధికి రూ.పదికోట్లు కేటాయించారు.

సంక్షేమ యజ్ఞం

అభివృద్ధితోపాటు సంక్షేమ యజ్ఞాన్నీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్విఘ్నంగా కొనసాగిస్తోంది.

- గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గవ్యాప్తంగా 20వేల మందికి ఇళ్లస్థలాలు ఇచ్చి పట్టాలు మంజూరు చేసింది. రుణాలు మంజూరు చేయించి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేసింది.
- వేలాది మంది గిరిజనుల భూములకు పట్టాలు అందజేసింది. వేలాది మంది మెట్ట రైతులకు బోర్లు మంజూరు చేసింది.
- వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది.
- విద్య, సేద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి పథకాలు దిగ్విజయంగా అమలు చేస్తోంది.
- మాచర్ల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు నాలుగేళ్లలో రూ.2,600 కోట్లు కేటాయించింది.

పంటకోత ప్రయోగాలపై బాధ్యతగా పనిచేయండి

వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశం



నరసరావుపేట: రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేసేందుకు, బీమా పరిహారం చెల్లించేందుకు వరి, కంది పంటల్లో పంటకోత ప్రయోగాల దిగుబడి కీలకమైనందున అందరూ బాధ్యతగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం పంటకోత ప్రయోగాలపై ప్రణాళిక, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బందికి నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈనెల ఏడో తేదీలోగా కౌలు రైతులు రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందేందుకు సీసీఆర్ కార్డులపై, కందిపంట సాగు విస్తీర్ణం పెంచేందుకు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్లు, బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకొని జేఎల్‌జీలు ఏర్పాటుచేసి కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ముఖ్యఉద్దేశ్యం, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ప్రయోజనాలు రైతులకు అందించేందుకు దిగుబడి ఆధారిత అంచనాల ఆవశ్యకతను తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి బీజే బెన్నీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉద్యాన, వ్యవసాయ శాఖల సహాయకులు పంట కోత ప్రయోగాలు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. మిరప పంటను ఈ ఏడాది దిగుబడి ఆధారిత పంటల బీమా పథకం కింద చేర్చేందుకు రాష్ట్ర స్థాయిలో చర్చిస్తున్నారన్నారు. చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కె.ముక్తేశ్వరరావు మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలను నిర్దేశించిన పంటలు, ఎంపిక చేసిన సర్వే నెంబర్లలో ఖచ్చితమైన దిగుబడులు లెక్కించాలన్నారు. గురజాల డివిజనల్ డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎం.డి.ఆయూబ్, స్టాటిస్టికల్ ఆఫీసర్ పి.మాలతీదేవి పాల్గొన్నారు.

ఓవరాల్ చాంప్ కర్ణాటక

- హోరాహోరీగా సాగిన జేఎన్‌వీ ప్రాంతీయ స్థాయి ఖోఖో పోటీలు
- సత్తా చాటిన వివిధ రాష్ట్రాల విద్యార్థులు



ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ చేతుల మీదుగా అందుకుంటున్న కలబురగి జేఎన్‌వీ విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: విద్యార్థి సవ్యసాచిలా ఎదగాలంటే అందుకు క్రీడలే శిక్షణ వేదికలుగా చేసుకోవాలని పల్నాడు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజులు ప్రాంతీయస్థాయి ఖోఖో పోటీలు శనివారంతో ముగిశాయి. హైదరాబాద్ జేఎన్‌వీ రిజనల్ పరిధిలోని ఆరు రాష్ట్రాల్లోని 77 జేఎన్‌వీల నుంచి 471 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మూడు విభాగాల్లో ఐదు మ్యాచుల్లో విజయం సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కర్ణాటక రాష్ట్రంలోని కలబురగి జేఎన్‌వీ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ముగింపు సమావేశంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చక్కని క్రమశిక్షణ, మంచి నాయకత్వ లక్షణాలు, ఓర్పు, సహనం వీటన్నింటికీ మించి ఏకాగ్రత క్రీడల ద్వారానే సిద్ధిస్తాయన్నారు. మరో అతిథి ధనలక్ష్మి గ్రూప్స్ డైరెక్టర్ పెర్ని వీరనారాయణ మాట్లాడుతూ నవోదయ విద్యాలయాల్లో విద్యతో పాటు క్రీడలు, సంగీతం, సాంస్కృతి రంగాల్లో తర్ఫీదునిస్తూ, అన్ని పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా మంచి ప్రోత్సాహన్ని అందిస్తాయన్నారు. క్రీడా పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్, కో–కన్వీనర్‌లు మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ ఎన్.నరసింహరావు, కృష్ణా జిల్లా జేఎన్‌వీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు ఫైనల్ విజేతల వివరాలను వెల్లడించి అతిథులచే బహుమతుల్ని అందజేశారు. విజేతలైన జట్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత సంపాదించడాన్ని అభినందించారు. ఆయా జట్లు త్వరలో రాజస్థాన్‌లో క్రీడాపోటీలకు హాజరు కావాలని తెలిపారు. జేఎన్‌వీ పూర్వ విద్యార్థి డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



కవలలతో జేఎన్‌వీ సమితి మాజీ అసిస్టెంట్ కమిషనర్ సి.ప్రభాకరరెడ్డి

ఫైనల్ విజేతలు వీరే...

అండర్ –14 బాలుర విభాగంలో కర్ణాటక కాలాబర్గి జేఎన్‌వీ విద్యార్థులు విన్నర్స్‌కాగా, ఏపీ కర్నూల్ జిల్లా జేఎన్‌వీ రన్నర్స్‌గా నిలిచారు. బాలికల్లో కాలాబర్గి జేఎన్‌వీ విన్నర్స్, తుంకూర్ జేఎన్‌వీ రన్నర్‌గా నిలిచారు. అండర్ –17 బాలికల విభాగంలో ఏపీ కృష్ణా జిల్లా జేఎన్‌వీ విన్నర్స్ గా, కర్నూల్ జిల్లా జేఎన్‌వీ రన్నర్స్‌గా, బాలుర విభాగంలో..కాలాబర్గి విన్నర్స్‌గా, ఏపీ కర్నూల్ జిల్లా జేఎన్‌వీ రన్నర్స్‌గా నిలిచారు. అండర్ –19 బాలికల్లో తుంకూరు జేఎన్‌వీ విన్నర్స్‌గా, ఏపీ కర్నూల్ జిల్లా జేఎన్‌వీ, అలాగే బాలుర విభాగంలో..కలబురగి జేఎన్‌వీ విన్నర్ కాగా, తెలంగాణ మహబూబ్‌నగర్ జిల్లా జేఎన్‌వీ రన్నర్స్‌గా నిలిచారు.

ఖోఖోలో సత్తా చాటుతున్న కవలలు

ఈ పోటీల్లో అండర్ –14 బాలికల విభాగంలో కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లా నవోదయ విద్యాలయానికి చెందిన ముగ్గురు సోదరీమణులు క్రీడలో అద్భుత ప్రతిభను చూపారు. ఒకే జట్టు, ఒకే పట్టుతో పోటీలో తమ సత్తాచాటి అందర్నీ అబ్బురపరిచారు. విజయాన్ని కైవసం చేసుకున్న వీరు ముగ్గురు ఒకే ముఖకవళికలు కలిగి ఉండటమే కాదు ఒకేలా ఆడుతుండడం గమనార్హం. కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి జిల్లాకు చెందిన శ్రీపాద, ఉష దంపతులకు ముగ్గురు ఒకే కాన్పులో ముగ్గురు బాలికలు జన్మించారు. వీరు జేఎన్‌వీలో 7వ తరగతి అభ్యసిస్తుండగా, ఏపీలోని మద్దిరాల జేఎన్‌వీలో జరిగే ప్రాంతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. తండ్రి శ్రీపాద సోలార్ ప్లేట్ల తయారీకి చెందిన కంపెనీలో చిరుద్యోగి కాగా తల్లి టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కవల సోదరీమణులను సాధినేని చౌదరయ్య స్కూల్ డైరెక్టర్ సి.ప్రభాకరరెడ్డి శనివారం అభినందించారు. ఐటీసీ జనరల్ మేనేజర్ రావిష్, షర్మిల, ప్రమీలలు అభినందించారు.

ఆలయంలో దొంగల బీభత్సం

- కేశఖండన శాలలో కేశాల అపహరణకు విఫలయత్నం
- పట్టుకోబోయిన కానిస్టేబుల్‌ను నెట్టివేసిన వైనం
- రేకులు విరిగి కిందపడి తీవ్రగాయాలు
- తెనాలి వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘటన



కానిస్టేబుల్‌ను దొంగలు నెట్టడంతో విరిగిన రేకులు

తెనాలిరూరల్: ఆలయంలో చోరీకి వచ్చిన దొంగలు బీభత్సం సృష్టించారు. చోరీ జరుగుతుందన్న సమాచారంతో వచ్చిన పోలీసులల్లో తనను పట్టుకోబోయిన కానిస్టేబుల్‌ను దుండగుడు కిందికి తోసేయడంతో తీవ్ర గాయాలయ్యాడు. ఆలయ కేశఖండనశాలలో చోరీ చేసేందుకు విఫలయత్నం చేసిన దుండగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కలియుగ ప్రత్యక్ష దైవం అయిన వేంకటేశ్వర స్వామికి భక్తులు తల నీలాలు సమర్పిస్తుంటారు. తెనాలి వైకుంఠపురంలోని లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించే తలనీలాలను కేశ ఖండనశాలలోని ఓ బాక్సులో భద్రపరుస్తారు. వారానికోసారి కేశాలను విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో కేశాలను అపహరించేందుకు ముగ్గురు దుండగులు నవనీ, సాయికుమార్, జీవనతేజ శుక్రవారం అర్ధరాత్రి ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించారు. కేశఖండనశాలకు పైకప్పులో ఉన్న రేకులను కొద్దిగా తొలగించి తాడు సహాయంతో లోపలికి దిగారు. అక్కడ శబ్దాలు వస్తుండడం గమనించిన ఆలయ వాచ్‌మెన్ డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. వన్‌టౌన్ పోలీసులు ఆలయానికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించి దుండగులు పరారయ్యేందుకు యత్నించారు. ఈ క్రమంలో వన్‌టౌన్ కానిస్టేబుల్ రమేష్ దుండగులను పట్టుకునేందుకు కేశఖండనశాల పైకి ఎక్కడంతో అక్కడ ఉన్న నిందితుల్లో ఒకడు కానిస్టేబుల్‌ను నెట్టివేయడంతో రేకులు విరిగి రమేష్ కేశఖండనశాలలో 12 అడుగుల ఎత్తు నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. ఘటనపై పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్టు దేవస్థాన సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో గస్తీ మరింత పెంచుతున్నట్టు తెలిపారు. ముగ్గురు నిందితుల్లో ఒకడైన సాయికుమార్ తండ్రి ఆలయ ప్రాంగణంలోనే కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తుంటాడని తెలిసింది. చోరీకి యత్నించిన సమయంలో సుమారు నాలుగు కిలోల తలనీలాలు ఉన్నట్టు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ సీఐ కె.చంద్రశేఖర్ తెలిపారు.

కానిస్టేబుల్‌కు గుంటూరులో మెరుగైన చికిత్స..

నగరంపాలెం: తెనాలి వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో దుండగులను పట్టుకునే ప్రయత్నంలో అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించి, ఈక్రమంలో గాయాలై గుంటూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెనాలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్‌బాబును పోలీసు అధికారులు పరామర్శించారు. వైద్యసేవల నిమిత్తం రూ.50 వేలు అందజేశారు. కానిస్టేబుల్ ధైర్య సాహసాలను డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి అభినందించారు. డీజీపీ ఆదేశాలతో గుంటూరు రేంజ్ డీఐజీ పాలరాజ్ తక్షణమే కానిస్టేబుల్‌కు అత్యవసర చికిత్స ఖర్చుల నిమిత్తం నగదును గుంటూరు జిల్లా పోలీస్ వెల్ఫేర్ నిధి నుంచి మంజూరు చేశారు. గుంటూరు ఏఎస్పీ (ఎల్/ఓ) కె.శ్రీనివాసరావు, తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు, తెనాలి ఒకటో పట్టణ పీఎస్ సీఐ కె.చంద్రశేఖర్ ఆసుపత్రికి చేరుకుని, కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

ఐదు లక్షల విలువైన శిరోజాలు చోరీ

నాదెండ్ల: ఇంటింటికి తిరిగి చిక్కు వెంట్రుకలు సేకరించే వ్యక్తి వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన శిరోజాలు చోరీకి గురైన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గణపవరం గ్రామంలోని జాతీయ రహదారి పక్కన అయ్యప్ప ట్రావెల్స్ పక్కనే నివాసం ఉండే ప్రసాదం శ్రీనివాసరావు మహిళల శిరోజాలు సేకరించి లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ పేరిట ఎగుమతి చేస్తుంటాడు. గత నెల రోజులుగా గ్రామాలు తిరుగుతూ సేకరించిన శిరోజాలను తన నివాసంలో గ్రేడింగ్ చేసి ఎగుమతికి సిద్ధం చేశాడు. శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో శిరోజాలతో కూడిన 22 బ్యాగులు వాహనంలో లోడు చేయించాడు. 12.30 గంటల సమయంలో తన కుమారుడు వెంకటేష్, డ్రైవర్ పిచ్చయ్యతో వాహనంలో హైదరాబాద్ బయలుదేరారు. నరసరావుపేట వద్దకు వెళ్లగా గాలికి కొట్టుకోవటంతో అనుమానం వచ్చి వాహనాన్ని నిలిపి చూశారు. తాళ్లను మరలా బిగించి హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడ దిగుమతి చేస్తున్న సమయంలో 21 బ్యాగులు మాత్రమే లెక్కకొచ్చాయి. ఒక బ్యాగు చోరీకి గురైనట్లు గుర్తించాడు. తిరుగు ప్రయాణమై ఇంటికి చేరాడు. ఇంటి వద్ద సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా, ఇరువురు వ్యక్తులు రాత్రి 11 గంటల సమయంలో బ్యాగును తీసుకెళ్తున్నట్లు గుర్తించాడు. చోరీ సంఘటనపై నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాలల చట్టాలపై అవగాహన

గుంటూరులీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు క్యాలెండర్ యాక్టివిటీస్‌లో భాగంగా శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పోలీసు అధికారులు, బాలల సంక్షేమ అధికారులు, ప్రత్యేక న్యాయమూర్తుల సభ్యులు, ప్రత్యేక జువెనైల్ పోలీసు విభాగాలకు బాలల చట్టాలపై అవగాహన కలిగించే న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి ఆధ్వర్యంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి జి.చంద్రమౌళీశ్వరి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సదస్సులో నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి నవ్యశ్రీ జువెనైల్ జస్టిస్ చట్టం, ఐపీసీ, బాలల సాక్ష్యానికి సంబంధించిన సాక్ష్యాధారాలు, సుప్రీంకోర్టు తీర్పులు, కేసులను త్వరితగతిన పరిష్కరించే ప్రక్రియకి సంబంధించిన నియమాలను వివరించారు. ఏపీ చైల్డ్ అడ్వొకేసి ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి పిల్లల రక్షణ, సంరక్షణ, చట్టానికి విరుద్ధంగా ఉన్న పిల్లలకు భిన్నమైన విధానాలపై మాట్లాడారు. ఏపీపీ సుకుమార్ కేసుల దర్యాప్తునకు అనుసరించాల్సిన విధానాలు, దర్యాప్తులో లోపభూయిష్ట అంశాలు వివరించారు.

మత్స్యకారుల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు

పులిచింతల ప్రాజెక్టులో 30లక్షల చేపపిల్లలను వదిలిన ఎమ్మెల్యే శంకరరావు



పులిచింతల ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: మత్స్యకారుల ఆర్థిక ఎదుగుదలకు వైఎస్ జగన్‌మోహనరెడ్డి సర్కారు అహర్నిశలు కృషి చేస్తుందని, వారి జీవితాలలో వెలుగులు నింపేందుకు అనేక సంక్షేమ పథకాలు తీసుకు వచ్చారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన మిషన్ ఫింగర్లింగ్స్ పథకం ద్వారా పులిచింతల ప్రాజెక్టు జలాశయంలో శనివారం రూ.45లక్షల విలువైన 30లక్షల చేపపిల్లలను ఎమ్మెల్యే వదిలారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్య సంపదలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. నాణ్యమైన చేపలను పెంచేందుకు ఫిష్ ఆంధ్ర పథకం ప్రవేశపెట్టి చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి సూచనలిచ్చినట్లు చెప్పారు. 50సంవత్సరాలు దాటిన మత్స్యకారులందరికి పెన్షన్ సదుపాయం కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. హార్బర్లు ఏర్పాటు చేయడం, జలాశయాలలో వదిలిన చేపపిల్లలు పెద్దవైన తరువాత వాటిని పట్టుకునేందుకు హక్కులు కల్పించి, మత్స్యకారుల ఆర్థిక ఎదుగుదలకు సీఎం ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. మత్స్యకారులను ప్రభుత్వ పరంగా అన్నిరకాలుగా ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. గతంలో మత్స్యకారులకు ప్రమాదం సంభవిస్తే కేవలం రూ.2 లక్షలు పరిహారం మాత్రమే ఇచ్చేవారని, జగనన్న పాలనలో రూ.10లక్షల వరకు ఇస్తున్నారని చెప్పారు. నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారన్నారు. జిల్లా మత్స్యశాఖాధికారి ఎస్. సంజీవరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మత్స్యకారుల కమిటీని ఏర్పాటు జరిగిందన్నారు. ఆ కమిటీ ద్వారా జలాశయాలలో పెరిగే చేపలపై హక్కు పొందడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, మత్స్యశాఖ సహాయ పర్యవేక్షకురాలు గేరా భాగ్యలత, పులిచింతల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుణకరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ మాదా వెంకట్రావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, ఎంపీటీసీ స్వర్ణమ్మభాయ్, మత్స్యకారులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ స్పార్కే సాయిరెడ్డి, ఉప ఎంపీపీ గంగసాని బాబు, జిల్లా పార్టీ కార్యదర్శి సుంకర శ్రీనివాసరెడ్డి, దేవరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే చంద్రబాబు దాడులు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : చంద్రబాబు పథకం ప్రకారమే టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ భౌతిక దాడులకు చేయిస్తున్నాడని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. ముత్యాలంపాడులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాసు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా కొత్త సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలందరికి దగ్గరయ్యారని, ఇవ్వన్ని గమనించిన చంద్రబాబు, జనసేన నాయకులు ఎక్కడికక్కడే గొడవలు పెట్టుకొండి..ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయండని కార్యకర్తలను రెచ్చగొట్టుతున్నారని విమర్శించారు. చంద్రబాబు తన తప్పును కప్పిపుచ్చుకుని ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో గొడవలు సృష్టిస్తున్నారని విమర్శించారు. వినుకొండలో ఎమ్మెల్యే కారు వస్తే దారి ఇస్తే ఎటువంటి సమస్య ఉండేదికాదని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కావాలనే ఎమ్మెల్యేని అడ్డుకుని దూషించి గొడవలు సృష్టించారని అన్నారు.

చిల్లర రాజకీయాలు ఎండగడతాం:

క్వారీ గుంతల్లో ప్రమాదవశాత్తూ పడి చిన్నారులు చనిపోతే టీడీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని, వారి చిల్లర రాజకీయాలను ఎండగడతామని కాసు అన్నారు. లోకేష్ పాదయాత్రకు వచ్చి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై అసత్యాలు ప్రచారం చేస్తే రూ.50వేలు డబ్బులు ఇస్తామని టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. యరపతినేని ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పిడుగురాళ్ల క్వారీ గుంతల్లో పడి ఇద్దరు వ్యక్తులు చనిపోతే కనీసం పరామర్శించలేదని, తుమ్మలచెరువులో నీరు-చెట్టు కింద ఇష్టం వచ్చినట్లు గుంతలు తవ్వి నీళ్ల నిలిచి పిల్లలు చనిపోయారని, యరపతినేని తవ్విన కుంటల్లో పడి వ్యక్తులు చనిపోతే తమకు అపాదించటం సమంజసం కాదన్నారు. టీడీపీ నాయకులను రాజకీయంగా ఎదుర్కొంటామని, చిల్లర రాజకీయాలపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాసు అన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- డీఎస్పీ ప్రసాదరావు
- జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం
- జిల్లా నలుమూలల నుంచి 20 జట్ల రాక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ ప్రసాదరావు

చీరాలరూరల్: చెడు అలవాట్లను విడనాడి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఎస్పీ ప్రసాదరావు ఆకాంక్షించారు. ప్రసాద్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలలో నైపుణ్యం కనబరచిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. నిత్యం క్రీడలపై మక్కువ పెంచుకుంటే శరీరధారుఢ్యం పెరగడమే కాకుండా స్నేహపూరిత వాతావరణంలో ఉంటారని పేర్కొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే పోటీ లు ప్రతిరోజు ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో తలపడేందుకు జిల్లా నలుమూలల నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాజట్లకు మొదటి బహుమతిగా కారుణ్యసేవా సమితి కొత్తపేట రూ.20 వేలు, రెండో బహుమతిగా ప్రసాదనగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ రూ.15 వేలు, మూడో బహుమతిగా గాదె సురేంద్ర కొత్తపేట రూ.10వేలు, నాలుగో బహుమతిగా శ్రీకాంత్‌రెడ్డి(చీరాల) రూ.5 వేలు, బెస్ట్‌రైడర్, బెస్ట్ డిఫెండర్లకు వడ్లమూడి వెంకటేశ్వరరావు(కొత్తపేట) రూ.5 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు అంపైర్లుగా ఎన్.రవీంద్రబాబు, బాలగురవయ్య, అచ్చయ్య, శ్రీను, శివ సిసీంద్రి వ్యవహరించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ హుమయూన్ కబీర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ యాస్మిన్ దంపతులకు సన్మానం



గుంటూరుమెడికల్:గుంటూరు డీఎంహెచ్‌వోగా, వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్‌గా విశేష సేవలందించి ఇటీవల పదవీ విరమణ చేసిన డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డాక్టర్ వెంకటేశ్వరరావు దంపతుల్ని శనివారం గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య అధికారులు సన్మానించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా కోవిడ్ సమయంలో డాక్టర్ యాస్మిన్ చేసిన సేవలను వైద్యులు, వైద్య అధికారులు కొనియాడారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా సుమారు ఐదేళ్లపాటు పనిచేసి వైద్య ఆరోగ్య శాఖను అభివృద్ధి పథంలో నడిపించారని వెల్లడించారు. రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది రాష్ట్ర కార్యాలయంలో కూడా లెప్రసీ, ఎయిడ్స్ కార్యక్రమాల అమలులో తమదైన ముద్ర వేశారన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డీఎల్వో డాక్టర్ బి.సుబ్బారావు పాల్గొన్నారు.

తెనాలిలో కుండపోత

తెనాలిఅర్బన్: పట్టణంలో శనివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అక్కడి నుంచి ఒక్కసారిగా చల్లబడి సాయంత్రం 5 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొంత సేదతీరారు. వర్షం వల్ల పట్టణంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

బాబుకి స్వార్థ రాజకీయాలు కొత్త కాదు

- పోలీసులపై దాడి సిగ్గుచేటు
- వారు సంయమనం పాటించకుంటే పరిణామాలు వేరుగా ఉండేవి
- పోలీసు రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ ఎస్పీ చక్రపాణి



పట్నంబజారు: చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు దాడులు చేయించటం సిగ్గుచేటని పోలీసు రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, విశ్రాంత ఎస్పీ చెన్నంశెట్టి చక్రపాణి మండిపడ్డారు. బ్రాడీపేటలోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందస్తు పథకం ప్రకారమే.. కార్యకర్తలను కయ్యానికి ఉసిగొల్పారని, దాడిలో ఎంతో మంది పోలీసులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడం బాధాకరమన్నారు. ఇటువంటి దాడులు చేయించి, తిరిగి ఇతరులపై ఆ నెపాన్ని నెట్టడం చంద్రబాబు కొత్తేమికాదన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలోనే ఇటవంటి దాడులు చేయించటం, తద్వారా అలిపిరి వంటి ఘటనలను అడ్డుపెట్టుకుని సానుభూతి పొందాలనుకోవటం చంద్రబాబు నీచ రాజకీయాలని దుయ్యబట్టారు. పోలీసు వ్యవస్థ లేకుండా ఒక్క అడుగు ముందుకు వేయలేని చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ బాబు ఇటువంటి కుట్రలు చేసి పోలీసులపైనే దాడులు చేయించటం అమానుషమన్నారు. గతంలో సైతం చంద్రబాబు సభకు వెళ్లిన పోలీసులను 'తింటానికి వచ్చారా..?' అని నీచమైన వ్యాఖ్యలు చేసిన పోలీసులపై వారికి ఉన్న గౌరవాన్ని స్పష్టంగా చూపెడుతున్నాయన్నారు. రోడ్ మ్యాప్ నిబంధనలను అతిక్రమించి, పుంగనూరులో జరిగిన మీటింగ్ టీడీపీ గూండాలను రెచ్చగొట్టిన చంద్రబాబు, పోలీసులపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బల్లికురవ: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండకు తూర్పు భాగంలో నక్కబొక్కలపాడు గ్రామ ఈర్ల చెరువు ఉంది. ఈ చెరువు కట్టపై చెట్టుకు 40 నుంచి 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శవం గుర్తించే పరిస్థితి లేదు. శనివారం అక్కడకు కట్టెలు కొట్టుకునేందుకు వెళ్లిన వాళ్లు దుర్వాసన రావటంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా ప్రదేశాన్ని సంతమాగులూరు సీఐ ప్రభాకర్, ఎస్ఐ వీ వేమన పరిశీలించారు. బాడీకి సంబంధించిన ఆనవాళ్లు లేకపోవటం, కుళ్లిన దుర్వాసన వస్తుండటంతో ప్రత్యేక అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆత్మహత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సింది.